\\ ఓం అస్మద్గురుభ్యో నమః //
\\ శ్రీమతే రామానుజాయ నమః //

కాశ్యపాన్వయ సంజాతం నారాయణ పదాశ్రితం//
శ్రీమన్నారాయణం వందే యతీశ్వర శ్రియాజుషం//

వేదాంతద్వయ తత్వజ్ఞం మంత్ర మంత్రార్ధధం గురుం/
శ్రీమన్నారాయణాచార్య రామానుజ యతిం భజే //

జై శ్రీమన్నారాయణ .. జై జై శ్రీమన్నారాయణ...

Pravachanam.com వారి నిర్వహణ లో
శ్రీ కందాడై రామానుజాచార్యుల స్వామి వారి అనుగ్రహభాషణంతో "శ్రీ భాష్యం" ప్రవచనాల ఆధారంగా భగవత్భక్తులు అడిగిన సందేహాలు మరియు వాటికి శ్రీ స్వామి వారి సమాధానాలు....

1) జీవుడు తరించటానికి భగవద్రామానుజులు వారు ప్రతిపాదించిన సులభ తరుణోపాయాలు ఏవి?

- ఆరు.

A) శ్రీ భాష్య సేవనము (శ్రవణం,పఠనం)
B) ద్రవిడవేదాగమములైన భగవద్విషయాది సేవనం
C) 108 దివ్యదేశముల యాత్ర
D) మేల్కోట,కంచి లాంటి అభిమాన దేశాల నివాసము
E) అర్థంతో కూడిన ద్వయమంత్రానుసంధానము
F) భాగవతుల అభిమాన సముపార్జన (సేవ)

2) సృష్టిలో పరమాత్మ అంతర్యామిగా ఉంటాడు కదా మరి మృత శరీరంలో కూడా ఉంటాడా?

శరీరం పాంచభౌతికమైనది విదితమే కదా ఆత్మ శరీరాన్ని విడిచిపెట్టితే అది మృత శరీరం,మానవ శరీరాలైతే దహనం చేయబడతాయి అగ్నిలో,జంతు శరీరాలు భూమిలో కలిసిపోతాయి ఒకనాటికి, అవన్నీ వేటి స్థానాల్లోకి అవి రూపాంతరం చెందుతాయి సర్వత్రా వ్యాపించి ఉండే పరమాత్మ పంచభూతాల్లోనూ ఉంటాడు అంతర్యామిగా, వస్తువులు రూపాంతరం చెందుతాయి.పరమాత్మ అన్నిటా, అంతటా వ్యాపించే ఉంటాడు, సర్వ వ్యాపకుడు.

3) శ్రీ నాథమునులవారి లుప్తమైన (మనదాకా అందకుండా పోయిన ) గ్రంథం ఏది?

" న్యాయతత్వవికాసం " అనే గ్రంథం చాలా విపులంగా అన్ని మతాలను ఖండించి విస్తారమైన వివరణ ఇవ్వబడిన గ్రంథం మనకు ప్రస్తుతం అందుబాటులో లేదు 16000 పేజీలు,32 భాగాలుగా ఉండేది

4) భగవద్రామానుజుల వారి శ్రీ భాష్యం కంటే ముందు ఎన్ని భాష్యాలు ఉండెవి?

మొత్తం పదహారు ఉండేవి. బోధాయనులు ,టంకాచార్యులు మెదలైన వారివి , అయితే అందులో కొన్ని మాత్రమే ఉన్నాయి కొన్ని సగమే ఉన్నాయి కొన్ని పూర్తిగా మనకు అందుబాటులో లేవు.

5) ప్రస్థాన త్రయం అంటే ఏవి?

- ఉపనిషత్తు భాష్యం
- శ్రీ భాష్యం
- గీతా భాష్యం

6) పరమాత్మ సాక్షిగా ఉంటాడా లేక నియమిస్తాడా?

చేస్తున్నప్పుడు చూస్తాడు,ఎలా చేయాలో చెప్తాడు,చేయకముందు చేసేలా ప్రేరేపిస్తాడు. అంటే పని చేస్తున్నప్పుడు పరమాత్మే చేయిస్తున్నాడు,పరమాత్మే అనుభవిస్తున్నాడు అనే "భావన"తో చేయాలి ( నేను కర్తని కాదు,భోక్తని కాదు అనుకోవాలి) అప్పుడు అన్నీ ఆయనే చూస్తాడు ఫలితం కూడా పరమాత్మకే చెందుతుంది. అప్పుడు ఆత్మకి ఏ పాపం అంటదు.

7) నైమిత్తిక ప్రళయములో మూడు లోకాలు లయమౌతాయి అన్నారు అవి ఏవి?

భూలోకం,భువర్లోకం,సువర్లోకం.. ఇవి ఛతుర్ముఖ బ్రహ్మ కి ఒక పగటి సమయం పాటు మాత్రమే ఉంటాయి ఆ తర్వాత ప్రళయమందు జలంలో కలిసిపోతాయి

8) సాష్టాంగ దండ ప్రణామాలు అంటే ఏమిటి?

శిరస్సు, లలాటం,నాసిక,ఆస్యము,వక్షస్థలం, ఊరువులు,మోకాళ్లు,పాదాలు ఈ ఎనిమిది అంగములు
కనురెప్పలు,చెవి చివర్లు,భుజాల చివర్లు,ఉపభుజాలు,,ముంజేతులు,ఊరువుకోణాలు,పాదముల కోణములు,ఉదరం యొక్క రెండు పార్శ్వాలు ఇవి ఉప అంగములు. వీటితో పెద్దలకు నమస్కరించాలి

9) సృష్టి,స్ధితి,లయలు మూడు ఒకేసారి సాధ్యమా?

సాధ్యమే.పరమాత్మకి ఇది చేయగలడు అది చేయలేడు అనే భేదాలు లేవు కావున ఒకేసారి చేస్తాడు, ఒకేసారి జరుగుతాయి.ఉదాహరణకు మన శరీరంలోనే ప్రతి క్షణం కొన్ని లక్షల కణాలు చనిపోతాయి కొన్ని లక్షలు పుడతాయి అంటే కొన్ని పోతున్నాయి (సంహారం,లయం) కొన్ని ఉంటున్నాయి (రక్షణ,స్ధితి) కొన్ని పుడుతున్నాయి (సృష్టి) ఇలా ఒక మానవ శరీరంలో ఇన్ని కార్యాలు ఏకకాలంలో జరుగుతున్నా శరీరంలో ఏ మార్పులు మనకు పైకి కనబడవు అలాగే పరమాత్మ చేత కొన్ని సృష్టి చేయబడుతాయి,కొన్ని రక్షించ బడుతాయి,కొన్ని సంహరించబడుతాయి ఏకకాలంలో..

10) శ్రీ వైష్ణవులకు ప్రపన్నులుకి తేడా ఏమిటి?

- శ్రీ మహా విష్ణువుని లేదా వారి అంశతో వున్న అవతరాలను (రామకృష్ణాది) పూజించి సేవించే వారు శ్రీ వైష్ణవులు,విశిష్టాద్వైత మతాన్ని ఆశ్రయించి,ఆచరణ చేయు వారిని శ్రీ వైష్ణవులు అంటారు
- పరమాత్మే ఉపాయం,ఉపేయం రెండూ అని నమ్మి శరణాగతి చేసినవారు ప్రపన్నులు

శ్రీ వైష్ణవమనేది మతమైతే ప్రపన్నత్వం అనేది వ్రతం/దీక్ష అవుతుంది శ్రీ వైష్ణవులందరూ ప్రపన్నులు కాలేరు

11) కైవల్యం,మోక్షం రెండూ వేరువేరా?

- కైవల్యం అనేది ఆత్మప్రాప్తి మాత్రమే,ఇది స్వయంపాకం లాంటిది (ఒక్కడే వండుకొని తినడం)

- మోక్షం అనేది పరమాత్మ ప్రాప్తి పరమాత్మను చేరుకోవడం,ఇది తధీయారాధన లాంటిది (ఒక వంద మందికి భోజనం వండి పెట్టడము )

12) సుదర్శన సూరి, భగవద్రారామానుజలు సమకాలీకులా ?

కాదు. భగవద్రామానుజుల వారు నియమించిన 71 సింహాసనాదిపతుల్లో,ఒకరి పరంపరలో కూరేశులైన నాల్గవ తరం (ముని మనవలు) వారు సుదర్శన సూరులు .

13) శ్రీ వైష్ణవ సంప్రదాయంలో జ్ఞానానికి ,విద్యకి హయగ్రీవున్ని ఉపాసన చేస్తాం కదా ! మరి భగవద్రారామానుజుల వారు సరస్వతీ దేవి దగ్గర శ్రీ భాష్య గ్రంధం ఉంచి ప్రార్దన ఎందుకు చేశారు?

భగవద్రామానుజులు వారి కాలంలో భారతదేశంలో ఎవరు ఏ గ్రంధం రచించినా సరస్వతీ అమ్మ వారు అనుమతి తీసుకోవాలి అన్న నియమాన్ని గౌరవించి భగవద్రామానుజులు వారు ప్రార్దన చేశారు. అలా చేసినప్పుడు సరస్వతీ అమ్మ వారు కూడా వారికి హయగ్రీవ అర్చామూర్తిసే ప్రధానం చేశారు శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామివారి ప్రచురణల్లోని "శ్రీభాష్యం" గ్రంధం యొక్క ముఖ చిత్రం కూడా అలానే ఉంటుంది అందు వలన మన మతానికి వచ్చిన భంగం ఏమి లేదు.

14) శ్రీ వైకుంఠం లొ ప్రకృతి ఉండదా?

వైకుంఠమనేది ప్రకృతి కి ఆవల ఉంటుంది, అది ప్రకృతికి అతీతమైనది, నిత్య విభూతి అంటారు, పరమాకాశం అంటారు, అక్కడ కూడా త్రైగుణ్యహితమైన ప్రకృతి ఉంటే మనమందరం అక్కడకి పోవాలని ఎందుకు అనుకుంటాము? ఇక్కడే ఉండచ్చు కదా! పరమపదంలో కాలం ఉండదు,సూర్య చంద్రులు ఉండరు ప్రకృతి ఉండదు. ప్రకృతి విడిస్తేనే మనం పరమపదానికి పోతాము.

15) శ్రీ భాష్య గ్రంధం దేవతలకి అక్కర్లేదా? మానవులకే నిర్దేశించబడినదా?

అవును. దేవతలకు అతి విస్తారమైన భోదాయన వృత్తి అర్దమౌతుంది వారికి ఆ అనుగ్రహం ఉంది,బుద్ది ఉంది,ఆయష్షు ఉంది. కానీ మానవులకి ఆ శక్తి లేదు కావున భగవద్రామునుజుల వారు భవిష్యత్తుతరాలకోసం వారిని తరింపచేయటానికి అతి విస్తారమైన భోదాయన వృత్తిని మనుషులకి అర్దమైయ్యే రీతిలో సడలీకరించి శ్రీభాష్యాన్ని రచించారు.

16) మోక్షమిచ్చేది బ్రహ్మ అంటే చతుర్ముఖ బ్రహ్మేనా?

వేదశాస్త్రాలలో,ఉపనిషత్తులలో బ్రహ్మ అనే పదం నిర్దేశించబడినది ఆ "పరమాత్మకే' సాక్షాత్తు ఆ **శ్రీమన్నారాయణుడికే** బ్రహ్మ పదం వర్తిస్తుంది. బ్రహ్మ అంటే పరమాత్మే ,చతుర్ముఖ బ్రహ్మ కాదు. పరమాత్మ లో ఉండే కొన్ని గుణాలు వారిలో కూడా ఉండటం వలన వాడుకలో సామాన్యంగా అలా పిలుస్తారు.అలాగని వారు బ్రహ్మలు అవ్వరు

17) బీష్మ పంచకం అంటే ఏమిటి?

మాఘ శుద్ద అష్టమి ని భీష్మాష్టమి అంటారు.బీష్మాష్టమి నుండి ద్వాదశి వరకు ( అష్టమి,నవమి,దశమి,ఏకాదశి,ద్వాదశి)ఐదు తిధులని బీష్మ పంచకం అంటారు ఈ ఐదు రోజులలో మానవులందరూ బీష్మ తర్పణాలు,అర్ఘ్య ప్రధానాలు చేయవలెను.

18) ఆదిశేషుడు అంటే ఎవరు?

పరమాత్మకి మెదటి దాసుడు. పరమాత్మ ఎక్కడ ఉంటే అక్కడ వారి సేవలో నిమగ్నమై ఉండే వాడు ఆదిశేషుడు, రామావతారంలో పరమాత్మ రాముడు,లక్ష్మణుడు ఆదిశేషుడు,కృష్ణావతారంలో పరమాత్మ కృష్ణుడు,బలరాముడు ఆదిశేషుడు

19) కర్మలన్నీ అస్థిర ఫలాలే కదా అలాంటప్పుడు కర్మలు చేయాలా?

శ్రుతులు మనకు కర్మలు చేయవద్దు అని చెప్పలేదు భగవద్గీత లో భగవానుడు కూడా కర్మలు ఆచరించవల్సిందే అని చెప్పాడు.వైరాగ్యం కలిగిన వాడైనా శరీరం ఉన్నంత వరకు అన్నం ఎలా తినకుండా ఉండడో/ఉండలేడో కర్మలు చేయకుండా కూడా ఉండడు/ ఉండలేడు మనం ఊపిరి తీసుకోవటం కూడా కర్మే మన ఊపిరి శరీరం లో జీవుడు ఉన్నంత వరకు తీసుకుంటాం కామ్య కర్మలను చేయవద్దు అని చెప్తున్నాయి.ఇల్లు కావాలి,రంభ కావాలి,స్వర్గాదులు కావాలి ,ధనం కావాలి ఇవన్నీ కోరి చేయకూడదు.ఫల సంగ కర్తృత్వం విడిచి భగవదర్పితంగా చేయాలి.

20) పిల్లలు కలుగకపోవటానికి కారణాలు ఏమిటి?

అది కూడా కర్మే . సంతానం కలగటానికి కర్మే,కలగకపోవటానికి కర్మే ,భరించే సంతానం కలగటం కర్మే హేతువు. “అపుత్రస్య గతిర్నాస్తి” అంటే స్వర్గం రాదు అని , మోక్షప్రాప్తి కలుగదు అని కాదు మోక్షానికి సంతానం ప్రతిబంధకమే ఎందుకంటే పుత్ర వాత్సల్యం ఉంటుంది చివర వరకు, అది ఉంటే మోక్షానికి అడ్డమే.
శ్రీవైష్ణవ సాంప్రదాయ పద్ధతిలో వైష్ణవులు స్వర్గాది భోగలోకాలు కోరుకోరు,పరమాత్మని చేరాలి అని మాత్రమే కోరుకుంటారు కనుక పరమాత్మ ని చేరుకోవటానికి పిల్లలు లేకపోవడం అడ్డు కాదు.

21) యజ్ఞాదులు చేయలేని వారికి ప్రత్యామ్నయాలు ఏమిటి?

యజ్ఞము, దానము,తపస్సు, ఉపవాసం,తీర్థస్నానం,తీర్థయాత్ర,నామస్మరణ,ఇలా ఎవరికి ఏది అనుకూలంగా ఉంటాయో అవి చేయవచ్చు వారి వారి వర్ణాశ్రమాలను బట్టి శాస్త్ర హితమైన ఉపాసనలే ఇవన్నీ. ఏవీ చేతకాని వాడికి/ చేయలేని వాడికి పరమాత్మ నామస్మరణము అన్ని పాపాలను నాశనం చేస్తుంది రామ,కృష్ణా,గోవిందాది నామములే ముక్తి మార్గాలు.

22) యజ్ఞ యాగాదులు చేస్తే దోషాలు పోతాయి అన్నారు యజ్ఞ యాగాదులు చేసినా భగవదునుగ్రహం కలుగదు అన్నారు ?

భగవంతుని తత్త్వము ఆత్మ గుర్తించిన తర్వాత సహజసిద్ధంగా ఆ భగవంతుని కి ఉపచారాలు చేయాలని ఇచ్ఛ పుడుతుంది ఆ "ఇచ్ఛే" మనను యజ్ఞ,యాగ,జప,తపస్సు,ఉపవాసాది ,ఎవరెవరి వర్ణాశ్రమ ధర్మాల ద్వారా శాస్త్ర విహిత కర్మలు చేస్తే వారికి పూర్వాశ్రమంలోని చెడు కర్మలు (పాపాలు) తొలగి భగవత్ప్రాప్తి కి మార్గములౌతాయి అంతేకాని వేదాధ్యయనం చేసిన తరువాత ఇహ పర లోకాలలో భోగాల కోసం యజ్ఞ యాగాదులు చేస్తే అవి 'అంత వరకే' ఫలాన్నిస్తాయి అంటే యజ్ఞాదులు మంచి కర్మలే... అయితే " కోరి " చేస్తే ఫలములు అల్పం.. ఫలాపేక్ష లేని యజ్ఞ యాగాదులు మాత్రమే భగవదనుగ్రహానికి ఉపకరణాలు.. అంటే మన దోషాలు
తొలగించటానికి పరమాత్మే (ఆయనకు మన మీద కల దయతో)మనచే మంచి కర్మలు చేసే దిశగా నడిపించి వాటిని తీసివేస్తాడు (పాప కర్మలు తొలగించి )ఇదే కదా "భగవదనుగ్రహం"....

23) కర్మ వేరు? ఉపాసన వేరా?

ఉపాసన అనేది కర్మే.పూజించటం,స్మరించటం,ద్యానం చేయటం ఇవన్నీ ఉపాసనలే కర్మలే.ఉపాసనలు చేస్తూ చేస్తూ ఉండటం వలన క్రమక్రమంగా బ్రహ్మ జ్ఞానం కలిగిస్తాయి అవే మోక్షానికి మార్గాలు ఉపాసనలు బ్రహ్మ జ్ఞానానికి అంగములు. అన్నం తింటే
ఆకలి పోతుంది అనే "జ్ఞానం" కలిగితే ఆకలి తీరుతుందా!
అన్నం తింటేనే ఆకలి తీరుతుంది అలాగే బ్రహ్మ జ్ఞానం కలిగితే బ్రహ్మ ను చేరుకోలేం,ఉపాసన చేయాలి.

24) ఆదిశేషుడు కి గరుత్మంతుని కి జాతి వైరం ఉంది కదా మరి పరమాత్మ సేవలో ఈ ఇరువురికి వైరం లేదా?

గరుడునికి సర్పాలు ఆహారం,ఆ సర్పాలు వినత కద్రువల ఉదంతంలో తన తల్లికి జరిగిన అవమాన భారంతో సర్పాలను ద్వేషించి వాటిని ఆహారంగా కావాలని కోరుకున్నాడు.అయితే అది కేవలం ఈ ప్రకృతిలో ఉన్నప్పుడే ఆ అవతార సమయములో మాత్రమే ఈ ద్వేషం,వైరం,పగ,రాగం,ప్రేమ,అసూయ,ఈర్ష్య ఇవన్ని ఈ ప్రకృతిలో మాత్రమే వైకుంఠం లో ఉండే పరమాత్మ దగ్గర ఇవేవీ ఉండవు/పని చేయవు అందుకే వారిని నిత్య సూరులు అంటారు
ఉదా॥ మనకు నిత్యం పరమాత్మ ని ఉపాసన చేసే ఋషుల ఆశ్రమాలలో జాతి వైరం ఉన్న పాము-ముంగిస,పిల్లి -ఎలుక ఇలా పరస్పర విరోధం ఉన్న వి కలిసి మెలసి ఉంటాయి అలాంటిది సాక్షాత్తు పరమాత్మ దగ్గర సేవ చేసే వారి దగ్గర వైరం ఎలా ఉంటుంది! ఉండదు.

25) వ్యాఖ్యానం అంటే ఏమిటి?

వ్యాఖ్యానం పంచ లక్షణం..

- పధచ్ఛేధము - సూత్రములోని పదాలను విభాగం చేయటం
- పదార్థోక్తి - పదములకి అర్థాలు చెప్పటం
- విగ్రహ వాక్యం - ఆ పదానికి అర్థమే ఎందుకు చెప్పాలో నిరూపణ చేయడం
- వాక్యయోజన. - విగ్రహ వాక్యాన్ని కూర్చడం,అన్వయం చేయడం
- ఆక్షేపణము - ఆక్షేపించబడ్డ వాక్యానికి సమాధానం తెలుపటం

మేషే భరణి సంజాతం శ్రీవత్స కులభూషణం/
రత్నమార్య గురోపుత్రం రామానుజం అహం భజే //

జై శ్రీమన్నారాయణ
జై జై శ్రీమన్నారాయణ 🙏🙏🙏🙏🙏